క్లుప్తంగా

మద్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచండి



ఎక్సైజ్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

గుత్తి: మద్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని ఉమ్మడి అనంత జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య ఆదేశించారు. గుత్తి ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. నవోదయం 2.0 పై సమీక్షించారు. కర్ణాటక మద్యం, నాటు సారా అక్రమంగా రవాణ కాకుండా చూడాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న బైండోవర్లు, అరెస్టులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఎస్ శ్రీరామ్, సీఐ ఉమాదేవి, ఎస్‌ఐలు అస్లాం బేగ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కూలీ సంఘం కమిటీ ఏర్పాటు

శింగనమల: రైతు కూలీ సంఘం మండల అధ్యక్షుడిగా శంకర్, కార్యదర్శిగా శర్మాస్ వలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. సోమవారం శింగనమల రామాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సహాయ కార్యదర్శిగా సూర్యనారాయణ, సభ్యులుగా ఆదిశేషయ్య, లక్ష్మీరంగయ్య, శ్రీరాములు, పెద్ద మునయ్య రాజారాం, శ్రీనివాసులు, స్వర నాగప్ప, రవిశంకర్ ఎన్నికయ్యారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో సోమవారం ఇరువర్గాల మధ్య ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో బాలాంజనేయులు, షెక్షావలి ఎదురెదురుగా నివాసం ఉంటారు. ఇంటి బయట మురుగు నీరు నిల్వ ఉన్న విషయంలో ఘర్షణ చోటుచేసుకుంది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి షెక్షావలి, అతడి సోదరుడు హుస్సేన్‌పై బాలాంజనేయులు సోదరులు కర్రలతో దాడి చేశారు. గాయపడిన షెక్షావలి, హుస్సేన్‌ను వెంటనే బంధువులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జైల్లో కంపోస్టు యార్డులు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాజశేఖర్

గుత్తి: సబ్ జైల్లో కంపోస్టు యార్డులు ఏర్పాటు చేయాలని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాజశేఖర్ స్థానిక జైలు అధికారులను ఆదేశించారు. గుత్తి సబ్ జైలును సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైల్లోని బ్యారెక్కులు, వంట గదులు, బాత్ రూమ్‌లు పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. ఖైదీలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. జైల్లో కంపోస్టు యార్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది గంగాధర్‌కుమార్, జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, కోర్టు సిబ్బంది సాదిక్ వలి, వార్డర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ, బేతాపల్లి గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి 26వ తేదీ వరకూ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 23, 24 తేదీల్లో కరిడికొండ, 25, 26 తేదీల్లో బేతాపల్లి సచివాలయాలలో ఆధార్ క్యాంపులు ఉంటాయన్నారు. ఆధార్ క్యాంపుల్లో ప్రజలు, విద్యార్థులు తమ ఆధార్ కార్డులలో తప్పులు, పేరు మార్పు లేదా అడ్రస్ మార్పు సరి చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పారిశుధ్యం మెరుగుపరచండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరిచి ప్రజారోగ్యాన్ని కాపాడాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను సీపీఎం నాయకులు కోరారు. సోమవారం కమిషనర్‌ను సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, నాయకులు కసాపురం రమేష్, సురేంద్ర, రంగమ్మ, తిమ్మప్ప, షాషా కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారన్నారు. కుక్కలు, పందులు, ఆవులు రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందిని కలిగిస్తున్నాయని వారు కమిషనర్‌కు వివరించారు.

వాసవీమాతా నమోస్తుతే..

- ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు
- కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు

సాక్షి నెట్‌వర్క్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామునే ఆలయాల్లో అమ్మవారి మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాభిషేకం గావించారు. వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం గోపూజ, గణపతి పూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని ఆలయ ప్రాంగణంలో విశేష అలంకరణలో కొలువుదీర్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు వద్ద కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, బలిజ సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



గుంతకల్లులో కంచి కామాక్షి అలంకరణలో వాసవీమాత



గుత్తి మండలం సేవాఘడ్‌లో పూజలందుకుంటున్న అమ్మవారు



తాడిపత్రిలోని అమ్మవారిశాలలో రాజరాజేశ్వరీదేవి అలంకరణ



పామిడిలో పెన్నానది జలం, వెండి బిందె ఊరేగిస్తున్న భక్తులు



గుత్తిలో రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం



పామిడిలో కన్యకా పరమేశ్వరీమాత



యాడికిలో రాజ రాజేశ్వరీ దేవిగా ..



శింగనమలలో బాలా త్రిపుర సుందరిగా..



నార్పలలో దుర్గాదేవి




పెద్దపప్పూరు మండలం రామకోటిలో చౌడేశ్వరి



పెద్దవడుగూరులో చౌడేశ్వరీదేవి



గుత్తిలో రాజరాజేశ్వరి దేవిగా వాసవీ మాత



గుంతకల్లులో వాసవీ మాత



తాడిపత్రిలో శ్రీమత్ కన్యకాపరమేశ్వరీదేవికి వెండి గొడుగును అందజేస్తున్న రాధాకృష్ణ

ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



గుత్తిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు



పెద్దపప్పూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదలకు వెంటనే ఇంటి స్థలాలు మంజూరు చేయాలని అఖిల భారత రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం రైతు సంఘం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు రామాంజనేయులు, కృష్ణ, జక్కన్న, రంగనాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇంత వరకూ ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. అనంతరం తహసీల్దార్ పుణ్యవతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాలు, ఓబులేసు, బాబయ్య, వెంకట్రాముడు, శ్రీనాథ్, దస్తగిరి, దేవి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: నిరుపేదలకు ఇంటిపట్టాలను మంజూరు చేయాలని సోమవారం తహసీల్దార్ బాలాజీ రాజుకు ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఆదినారాయణ, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు గోపాలు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పెద్దిరాజు, సీపీఐ మండల కార్యాదర్శి చింతా పురుషోత్తం వినతిపత్రం అందజేశారు. నరసాపురం, వెంగంపేట మార్గమధ్యంలో ప్రభుత్వ స్థలం ఉందని, ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించాలని చూస్తున్నారన్నారు. ఆ స్థలంలో ఇల్లు లేని మాదిగలకు పట్టాలని ఇవ్వాలని కోరారు.ఎమ్మార్పీఎస్ నాయకులు ఆది, మురళి, పెద్దన్న, సునీల్, ఆదినారాయణ,పెద్దపెద్దయ్య, శివ, ఓబులనారాయణ, శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థల ఆక్రమణపై విచారణ

పెద్దవడుగూరు: మండలంలోని చిన్నవడుగూరులో ప్రభుత్వ స్థల ఆక్రమణపై రెవెన్యూ అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. వివరాలు.. గత కొన్ని నెలలుగా ప్రభుత్వ భూమి, శ్మశాన వాటికను ఆక్రమించారనే ఉద్దేశ్యంతో కొందరు గ్రామస్తులు అనుభవంలో ఉన్నవారిపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో ఆదివారం గ్రామస్తులు, అనుభవదారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు తహసీల్దార్ ఉషారాణి ఆధ్వర్యంలో అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. శ్మశాన వాటిక కు అవసరమైన భూమిని తిరిగి ఇవ్వాలన్నారు. అందులో ఉన్న కంపచెట్లను జేసీబీతో తొలగించే ప్రయత్నం చేశారు. ఈ భూమి విషయంపై అనుభవంలో ఉన్నవారు కోర్టును ఆశ్రయించినట్లు స్థానికులు తెలిపారు. గ్రామస్తులు, అనుభవందారులకు అధికారులు సర్ధిచెప్పి ఎలాంటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు.



చిన్నవడుగూరులో విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

ఎమ్మెల్యే గారూ.. రోడ్డు దుస్థితిని చూడండి

శింగనమల: మండలంలోని నిదనవాడ–రాచేపల్లి గ్రామాల మధ్య ఉన్న తరిమెల రోడ్డుకు మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యలో గుంతను గమనించక పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని సీపీఎం నాయకులు భాస్కర్, శ్రీనివాసులు కోరారు.



నిదనవాడ–రాచేపల్లి గ్రామాల మధ్య తరిమెల రోడ్డుపై పెద్ద గుంత పడిన దృశ్యం. (ఇన్‌సెట్‌లో) ప్రమాదకరంగా గుంత

గ్రామ కమిటీలతో పార్టీ బలోపేతం

గుత్తి రూరల్: గ్రామ కమిటీలతో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంగరాజు, ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్‌కుమార్ యాదవ్, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి సూచించారు. మండలంలోని అనగానదొడ్డి, పూలకుంట, ఈశ్వరపల్లి గ్రామాల్లో సోమవారం వారు పర్యటించి గ్రామ కమిటీలకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. భవిష్యత్తులో పార్టీ పిలుపునిచ్చే పోరాటాలు, ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు గ్రామ కమిటీలు ముందుండాలన్నారు. 2029లో జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, గురుప్రసాద్‌యాదవ్, సురేష్, చంద్ర, ఓబుళయ్య, కాశీ పాల్గొన్నారు.



అనగానదొడ్డిలో నియామక పత్రాలు అందజేస్తున్న నాయకులు

రైతులకు యూరియా సరఫరా చేయండి

శింగనమల: మండలంలోని రైతులకు తగినంత యూరియా సరఫరా చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ మాట్లాడుతూ రైతులకు యూరియా, జిప్సం, జింక్, బోరాన్ అందుబాటులో ఉంచాలన్నారు. తరిమెల రైతు సేవా కేంద్రానికి అధికారిని నియమించాలన్నారు. తరిమెల పీహెచ్‌సీలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రజలు విష జ్వరాలు ప్రబలుతున్నాయని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. రాచేపల్లి వద్ద యున్న లెదర్ ఫ్యాక్టరీని పునః ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెద్దన్న, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నేడు గూగూడులో హుండీ కానుకల లెక్కింపు

శింగనమల(నార్పల): నార్పల మండలంలోని గూగూడు కుళ్లాయిస్వామి దేవస్థానంలో మంగళవారం అన్నదాన హుండీ, నెల కందకం, ఆంజనేయ స్వామి హుండీల్లోని కానుకలను లెక్కిస్తామని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శోభ సోమవారం తెలిపారు. హుండీల లెక్కింపు దేవస్థానంలో నిర్వహిస్తామన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

గార్లదిన్నె: మండలంలోని కొప్పలకొండ, కమలాపురం, యర్రగుంట్లలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. ఏఓ మాట్లాడుతూ కొండలకొండలో 12 టన్నులు, కమలాపురంలో 12 టన్నులు, యర్రగుంట్లలో 6 టన్నులు యూరియా రైతు సేవా కేంద్రాల్లో రైతులకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ హరిబాబు, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పెద్దవడుగూరు/పుట్లూరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి సూచించారు. సోమవారం పెద్దవడుగూరు మండలంలోని గుత్తిఅనంతపురం అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసం దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే పుట్లూరు మండలంలోని శనగలగూడూరు అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, మహిళా పోలీస్ శ్వేత, అంగన్‌వాడీ కార్యకర్తలు అనంతలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అరటి రైతులను ఆదుకోండి

బుక్కరాయసముద్రం: అరటి రైతులను ఆదుకోవాలని పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రెడ్డిపల్లిలో రైతు సంఘం నాయకులు పండ్ల తోటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అరటి పంట టన్ను రూ.15 వేలతో కొనుగోలు చేయాలన్నారు. నాయకులు శ్రీనివాసులు, ఆదినా రాయణ, వేణు, ఆంజినేయులు, రోశయ్య పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

పుట్లూరు: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో సోమవారం పంట కోత ప్రయోగాలపై వ్యవసాయ అధికారి కాత్యాయని, ఏఎస్‌ఓ విజయ కుమార్ వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పంట కోత ప్రయోగాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్ణీత కొలతలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ నాగిరెడ్డి, వీహెచ్‌ఏలు, వీఏఏలు, ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగేంద్ర(46) సోమవారం గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మృతదేహాన్ని సందర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

వ్యాధులపై అవగాహన



వేములపాడులో మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

యాడికి: మండలంలోని యాడికి, రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్యులు సుమంత్ రెడ్డి, దేవరాజన్ ఆధ్వర్యంలో ప్రజలకు వివిధ రకాల వ్యాదులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

పామిడి: పట్టణంలోని షాదీఖానా వెనుక బెస్త వీధిలో బెస్త సుధాకర్ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వీ యుగంధర్ సోమవారం తెలిపారు. ఈనెల 17న బెస్త సుధాకర్ హత్యకు గురైన విషయం విదితమే. బెస్త సుధాకర్‌ను రోకలి బండతో మోది చంపిన కేసుకు సంబంధించి.. మృతుని భార్య మీనాక్షి, కుమారుడు ప్రకాష్‌తో పాటు హత్యకు సహకరించిన మహబూబ్ బాషాను పోలీసులు అరెస్ట్ చేసి గుత్తి కోర్టుకు హాజరు పరిచారు. కోర్టు నిందితులను గుత్తి సబ్–జైలుకు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

ఆర్టీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యువల్ చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

శింగనమల: పేద ప్రజలకు అండగా ఉన్న ఆర్టీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యువల్ చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి రామాంజినేయులు కోరారు. సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, సూరి, శ్రీరాములు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



లక్ష్మీనారాయణమ్మ

పెద్దపప్పూరు: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. వివరాలు.. మండలంలోని జూటూరు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణమ్మ నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల గాలించినా ఆమె కనిపించలేదని భర్త పెద్దిరాజు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలపారు.

‘వితంతు పథకం’ లేదంటే.. వినరే..!



తాడిపత్రిలోని తహసీల్దార్ కార్యాలయానికి భారీగా తరలివచ్చిన వితంతువులు, వృద్ధులు

తాడిపత్రి రూరల్: నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం పథకం అమలులో లేదని, వితంతువులకు రూ.20వేలు ఇస్తారన్నది అవాస్తమని, దరఖాస్తులివ్వడానికి కార్యాలయానికి రావద్దని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది చెబుతున్నా వినడం లేదు. కార్యాలయానికి సోమవారం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన వితంతువులతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఎటు చూసినా వితంతువులు, వృద్ధులు కనిపించారు. ఇలా ఎన్నాళ్లు దరఖాస్తుల పేరుతో కార్యాలయానికి వస్తారో తెలియక సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. కాగా దరఖాస్తులు రాసే వారికి పెద్ద పండుగలా మారింది. వితంతువుల నుంచి ఒక్కో దరఖాస్తు రాయడానికి రూ.30 నుంచి రూ.50 వసులు చేస్తున్నారు.



అటెండర్‌కు దరఖాస్తులు అందజేస్తున్న వితంతువులు



ఎండవేడిమికి తాళలేక ఇసుక దిబ్బలపై సేద తీరుతున్న వృద్ధులు